

# ముందు చూపు

'విజయమూర్తి

ఉలిక్కిపడ్డాడు రాజారావు!—తనను రాసుకుంటూ ఇద్దరు ఆడపిల్లలు కిలకిలలాడుతూ వెళ్ళిపోయారు.

వాళ్ళలోకం వాళ్ళదిలాగానే వుంది గానీ, పరిసరాలను పరికించవలసిన అవసరంకూడా లేదన్నట్లు ప్రవర్తించారు వాళ్ళు.

వాళ్ళెవరో అతనికి తెలియకపోలేదు!

తన యింటికి నాలుగిళ్ళ యివతల ఆ మేడమీదనుండి అటుప్రక్కగా వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడూ వినిపిస్తూనే వుంటాయి వాళ్ళ ఇకఇకలు, పకపకలు.

దానికితోడు మరొకటుంది!

పుష్పక విమానం కైలాస పర్వతం దగ్గరకు రాగానే మరి ముందుకు సాగటానికి వీల్లేదన్నట్లు ఠక్కున ఆగిపోయిందిట! ఆ మాట ఎంతవరకు నిజమో తెలియదుగానీ, ఆ మేడముందుకు రాగానే విద్యార్థిబృందం తాలూకు నడకలే కాదు, వాహనాలుకూడా ఒకవేళ ఆగకపోయినట్లయితే, మెల్లిగా పెళ్ళివారి నడకలా సాగవలసిందే!—అది రూల్!!

*　　　　*

రాజారావు ఇంట్లో అడుగుపెట్టగానే రాజు, రామం, శశి కాళ్ళకు చుట్టేశారు.

ప్రొద్దున్న తను నిద్దర లేవకుండానే వాళ్ళు బళ్ళోకి పోతారు. తను ఆఫీసుకు బయలుదేరే వేళకి వాళ్ళింట్లో వుండరు. వాళ్ళు బళ్ళోంచి తిరిగి వచ్చేసరికి తనింట్లో వుండడు. అటువంటి పరిస్థితిలో తనింట్లో అడుగుపెట్టగానే, ఏదో పొరుగూరు వెళ్ళిన తండ్రి అప్పుడే తిరిగివచ్చినట్లుంటుందేమో వాళ్ళ ప్రాణానికి!

తన పిల్లల ప్రవర్తనపట్ల రాజారావు ఉద్దేశ్యం అదయితే కావచ్చు. కాని ఆ పసి హృదయాలలో వున్న ఆలోచన—రోజూ మామూలావున్నా - ఆరోజుమాత్రం అదికాదు!....మరి?

నవ్వుతూ దగ్గరకు పిలిస్తే భుజం మీదెక్కి స్వారీ చేసేటంతటి చనువయితే ఆ పిల్లలకు వుంది. కాని కోపంతో కోరచూపు చూడనే అక్కరలేదు, కనుబొమలు ముడుచుకుంటేనే చాలు, ఆ ఛాయలకు రావటానికయినా ధైర్యం చెయ్యలేరు.

ఆ నాటి దినచర్యకు తోడు ఆఫీసు నుంచి ఇంటిదాకా నడిచివచ్చినందుకు అలసట, మనసుకు చికాకు కలిగిస్తున్నా దాన్ని ప్రక్కకునెట్టి నవ్వుముఖంతో పలకరించాడు రాజారావు పేరుపేరునా.

తమ హృదయాలు సంతోషంతో పొంగిపోతున్న విషయం వ్యక్తం చేయగలిగారు గానీ, ఆ ఆనందానికి గల కారణమేమిటో చెప్పే ధైర్యంమాత్రం లేకపోయింది వాళ్ళల్లో ఎవరికీ.

తన కేసు తను వాదించుకోలేని ముద్దాయికి న్యాయవాది దొరికినట్లు కాఫీకప్పుతో ఎదురువచ్చే తల్లిని చూసి కొండంత ధైర్యం వచ్చినట్లుంది. చిలిపిగా కళ్ళు చికిలిస్తూ ఏవేవో సైగలుచేసారు ముగ్గురూ కలిసి.

కుర్చీలో కూర్చుని కాఫీ సేవిస్తున్న భర్తను అనునయంగా అడిగింది అనసూయ. "మీరేమీ అననంటే ఒక్క విషయం చెబుతానండి!"

"ఊ!"

"మధ్యాహ్నం భోజనాలుచేసి పిల్లలతో ఆడుకుంటూంటే ఏదో తలుపుగీరిన చప్పుడయింది. తలుపు తీసి చూచేసరికి ఒక కుక్కపిల్ల 'మొయ్ మొయ్' మని ఏడుస్తూ లోపలికి వచ్చిందండి. అప్పటి నుంచి పిల్లలంతా దాన్ని ఒక్క క్షణం కూడా వదిలి పెట్టి వుండలేదంటే నమ్మండి. దాన్ని మనం పెంచుకుందామని ఒకటే గోల పెడుతున్నారు పాపం! మీరు 'ఊ' అంటే...."

"బాగానే వుంది. ఏదీ? ఎక్కడుంది?"

నేనంటే నేనంటూ ముగ్గురుపిల్లలూ పోటీలుపడి పరిగెత్తారు, దాన్ని తీసుకు రావటానికి.

వాళ్ళ చేతుల్లోంచి దాన్నందుకుని, ఆప్యాయంగా దువ్వి క్రింద వదిలిపెట్టాడు రాజారావు.

భార్యవైపు తిరిగి 'సరేలే, చూద్దాం!' అన్నట్లు తల తాటించాడు.

కుప్పిగంతులతో గదిమూలకు పోయి ముడుచుకుని పడుకుందా కుక్కపిల్ల. పిల్లలు ముగ్గురూ దానివెంటబడి చుట్టూ మూగారు.

"దీని పేరు 'రోజా' అని పెడితే బాగుంటుంది కదూ?" రాజు సలహా అది.

"కాదు! 'లిల్లీ' అని పిలుద్దాం!" రామం తన అభిప్రాయాన్ని చెప్పాడు.

"అదేం కాదు! 'పప్పీ'!" అంది ముద్దుమాటల్తో శశి.

వాళ్ళ సంభాషణలు విన్న రాజారావుకి ఎందుకో గానీ వీధి మొదల్లో కనిపించిన ఆడపిల్లలు గుర్తుకువచ్చారు. మనస్సు పరిపరివిధాల పోయింది.

"ఏమిటీ, ఇది ఆడకుక్కా?" అనుమానం రహితం చేసుకోటానికి భార్య నడిగాడు.

"అవునండి!"

"లాభంలేదు!" పెదవి విరిచాడు రాజారావు.

ఆ సంభాషణను అదోవిధంగా అర్థం చేసుకున్న ఆ పిల్లలకు అధైర్యం పట్టుకుంది. దిగులుగా తల్లివంక చూసారు.

"ఆడుకోండర్రా, మీరు వెళ్ళి ఆడుకోండి!—నాన్నగారు ఒప్పుకున్నారుగా, అది మనింట్లోనే వుంటుంది!" అంటూ వాళ్ళని అవతలకి పంపించేసి తిరిగి వచ్చింది అనసూయ.

"ఏమిటండీ మీ అనుమానం?"

కొన్నిక్షణాలు ఆలోచనలో మునిగి తేలాక ఒక నిశ్చయానికి వచ్చాడు రాజారావు—"అది మనింట్లో వుండటానికి వీల్లేదు!"

"ఏం? ఎందుకని?" కటువుగా ఆరంభమైన వాక్యం అనునయాన్ని వ్యక్తం చేస్తూ మారిపోయింది. "అది కాదండీ! పాపం, పిల్లలు ఎంతో ముచ్చట పడుతున్నారు. వాళ్ళకోసమయినా ...."

"అవాచ్చు!—ఏ పని చేయబోయే ముందయినా ముందుచూపు చాలా అవసరం. బాధల్ని కొని తెచ్చుకునే పనుల జోలికి అసలు పోకపోవడమే మంచిది."




అర్థం కానట్లు భార్య చూడటంతో చెప్పుకుపోయాడు.

"అదికాదు, అనూ!—దీన్నిప్పుడు పెంచి పెద్ద చేసినందువల్ల తర్వాత వచ్చే బాధలగురించి ఆలోచించావా?"

"ఏమిటండీ ఆ బాధలు!"

"ఇది ఆడకుక్కని మరిచిపోకు!—అంటే ఇది పెరిగి పెద్దదయాక ఊళ్ళో వున్న మగకుక్కలన్నీ మనింటిదగ్గరే వుంటాయి—ఆడకుక్కని పెంచి మావాడొక డెన్ని బాధలు పడ్డాడో నీకేం తెలుసు?"

అలాగే చూస్తూ వుండిపోయిన అనసూయ చాలాసేపటికి గానీ తేరుకోలేదు.

"కానీ పిల్లలు...."

"మరేం ఫరవాలేదు! దాన్ని గురించి కూడా ఆలోచించాను. వాళ్ళతో అసలీ విషయం చెప్పొద్దు. వాళ్ళంతా నిద్రపోయాక, అర్ధరాత్రి దాన్ని తీసికెళ్ళి అవతలి వీధిలో వదిలేసి వస్తాను. తెల్లవారి లేచాక పిల్లలడిగితే కుక్కపిల్ల ఎటో పారిపోయిందని చెప్పు. తెలిసిందా?"

ఆమె మనస్సు ఎందుకో బాధపడింది. ఆ బాధ కనిపించకుండా ముఖాన్ని ప్రక్కకు తిప్పుకుని "సరే, మీ యిష్టం!" అంటూ వెళ్ళిపోయింది.

*

వీధి తలుపు గడియవేసి లైటార్పి మంచంమీద విశ్రమించిన రాజారావుకి ఐదునిముషాలయాక చెంప చెళ్ళుమన్నట్లయింది—దానికి కారణం అతని మనోనేత్రం ముందు మెదిలిన ఆ దృశ్యం! అంతరాత్మ నిలేసి అడిగిన ఆ ప్రశ్న!!

"దారిన పోయే కుక్కపిల్ల గనుక నువ్వలా చెయ్యగలిగావు! కడుపున పుట్టిన కూతురు మాటేమిటి?...."